

సుబ్బారాయుడి సేవలో..

మోపిదేవి: స్థానిక వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని తెలంగాణ లోకాయుక్త డాక్టర్ వి. నిరంజనరావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): నిత్యాన్న దాన పథకానికి గుంటూరుకు చెందిన నోముల నాగ సురేష్, నాగ వెంకట శివలక్ష్మి కుటుంబం రూ. 1,00,116 విరాళం అందజేశారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్ : జిల్లా వ్యాప్తంగా ఆది వారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవిం చలేదు.

న్యూస్‌రీల్

జాతీయ సాహిత్య పురస్కారానికి ఆళ్ల ఎంపిక



ఆళ్ల నాగేశ్వరరావు

తెనాలి: హైదరాబాద్‌లోని పఠాన్‌చెరువులో ఈనెల 30న తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సాహిత్య సంబరాలు/పురస్కారాల ప్రదానానికి తెనాలికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావుకు ఆహ్వానం లభించింది. సంస్థ నిర్వహించిన ఉగాది సాహితీ సంబరాల సంకలనంలో ప్రచురణకు నాగేశ్వరరావు రాసిన కవిత ఎంపికైంది. ఇందుకుగాను జాతీయ పురస్కారంతోపాటు బిరుదు ప్రదానం, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను అందజేస్తారు. నాగేశ్వరరావు ఆర్టీసీ కండక్టరుగా పనిచేస్తున్నారు.

మూడో రోజుకు చేరిన తిరునక్షత్ర ఉత్సవాలు



తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై తిరునక్షత్ర ఉత్సవాలు ఆదివారంతో మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నిర్వాహకుడు పురాణం వెంకటచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై భగవద్రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా మూడో రోజు రామాజనుల వారికి, రోహిణి నక్షత్రం సందర్భంగా శ్రీకృష్ణ పెరుమాళ్లకు తిరుమంజన సేవ, రామానుజుల వారికి అలంకరణ, లిల్లీ పుష్పాలతో సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించామని, అనంతరం శ్రీయాగ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహాన్ని పొంది తీర్థ ప్రసాదాలు స్వీకరించారని తెలియజేశారు.

చెస్ ర్యాంకింగ్ టోర్నీలో సత్తా



విజయవాడ స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి అండర్-17 బాలికల చెస్ ర్యాంకింగ్ టోర్నీలో గుంటూరు క్రీడాకారిణి వి.మోహిత 7.5 పాయింట్లతో మొదటి స్థానంలో నిలవగా, ఎన్టీఆర్ జిల్లా క్రీడాకారిణి సీహెచ్ శర్వాణి ఏడు పాయింట్లతో రెండో స్థానంలో, కృష్ణాజిల్లా క్రీడాకారిణి కె.భువన ఆరు పాయింట్లతో మూడో స్థానంలో నిలిచారు. కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఈ టోర్నీ ఆదివారం ముగిసింది. రోజుకు రెండు రౌండ్ల చొప్పున ఈ పోటీలు జరిగాయి. మొదటి 12 స్థానాల్లో సాధించిన క్రీడాకారులకు ర్యాంకింగ్ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆంధ్రా చెస్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి ఎ.ఉదయ్‌కుమార్, కృష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ఎం ఫణికుమార్, ఎన్టీఆర్ జిల్లా సంఘం అధ్యక్ష,కార్యదర్శులు అక్బర్‌పాషా, రాజీవ్, ప్రకాశం జిల్లా కార్యదర్శి నబి, టోర్నీ డైరెక్టర్ పి.రేణుక విజేతలకు బహుమతులు అందజేశారు.

కృష్ణానదిలో మునిగి విద్యార్థి మృతి



షేక్ మహ్మద్ ఉమర్ మృతదేహం

కొల్లిపర: కృష్ణానదిలో మునిగి విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తెనాలి నందులపేటకు చెందిన షేక్ మహ్మద్ ఉమర్(20) తన తమ్ముడుతోపాటు ఐదుగురు స్నేహితులతో కలసి కొల్లిపరలోని కృష్ణానదికి వచ్చారు. ఉమర్‌తోపాటు తన తమ్ముడు మరో విద్యార్థి కలసి ఈతకు దిగగా లోతైన ప్రదేశం కావటంతో ముగ్గురు నీటిలో మునిగిపోయారు. మిగిలిన నలుగురు గమనించి ఇద్దరిని రక్షించారు. ఉమర్‌ను రక్షించలేకపోయారు. స్నేహితుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వెంటనే గజ ఈతగాళ్లని పిలిపించి గాలింపు చేపట్టారు. ఉమర్ కనిపించటంతో వెంటనే 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతి చెందిన ఉమర్ వైజాగ్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైటర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహం ఇవ్వనున్నట్లు తెలిపారు.



ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెంలో మిర్చి కల్లాల్లో పట్టాలపై నిలిచిన వర్షపు నీరు



నరసరావుపేట రూరల్ మండలం పాలపాడులో మొక్కజొన్న కల్లంపై నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపుతున్న రైతు



చుందూరులో మొక్కజొన్న దిగుబడులపై పట్టాలు కప్పుతున్న దృశ్యం

‘అకాల’ కష్టం

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఆదివారం మధ్యాహ్నం ఉన్నట్లుండి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీవర్షం కురిసింది. వర్షానికి తోడు ఈదురుగాలులు వీయడంతో పెద్ద చెట్లు నేలకూలాయి. పలు చోట్ల నివాసాలు కూలిపోయాయి. అకాల వర్షం, గాలులు రైతులకు కడగండ్లు మిగిల్చాయి. పలు చోట్ల తోటల్లోని మామిడికాయలు నేల రాలగా.. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి, మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు తంటాలు పడ్డారు. నిమ్మ, అరటి వంటి ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెంలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందారు.

– సాక్షి నెట్‌వర్క్



ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం బస్‌షెల్టర్ ఎదురు కూలిపోయిన దుకాణ సముదాయాల రేకుల షెడ్డు

జిల్లాలో తీరనున్న రక్తం కొరత

- మే నుంచి అందుబాటులోకి రెడ్‌క్రాస్ కాంపోనెంట్ బ్లడ్‌సెంటర్
- పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ శివశంకర్



బ్లడ్‌సెంటర్‌లో బెడ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.కోట్ల వ్యయంతో ఏర్పాటుచేస్తున్న కాంపోనెంట్ బ్లడ్‌సెంటర్ మే నెల నుంచి అందుబాటులోకి వస్తుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కలెక్టరేట్ సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ వైద్యశాలలో ఏర్పాటు చేస్తున్న బ్లడ్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ బ్లడ్‌సెంటర్‌కు సంబంధించిన పనులు ఏ స్థాయి వరకు వచ్చాయో, ఎప్పుడు ప్రారంభించవచ్చో పరిశీలించేందుకు సందర్శించడం జరిగిందన్నారు. బ్లడ్‌సెంటర్‌లో 400 యూనిట్ల రక్త నిల్వలు నిల్వ చేయవచ్చన్నారు. దీని ద్వారా జిల్లాలో రక్తకొరత చాలా వరకు తగ్గుతుందన్నారు. ప్రత్యేకంగా న్యూఢిల్లీ రెడ్‌క్రాస్ రూ.4కోట్లు విలువ చేసే మెషినరీని అందించారన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు, దాతల నుంచి విరాళాలను సేకరించి వాటితో 75శాతం పనులను పూర్తి చేశారన్నారు. ఇంకా సుమారు రూ.20లక్షల విలువ చేసే పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనికోసం స్థానిక ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తమవంతు కృషిచేశారని, అలాగే రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామరెడ్డి, ఎంపీ లావుకృష్ణదేవరాయలు చెరో రూ.5లక్షలు మంజూరు చేశారన్నారు. అనంతరం శ్రీ సాయి సుజాతా బిల్డర్స్ అండ్ డెవలపర్స్ సంస్థ తరఫున గెల్లి వీరారెడ్డి నుంచి రూ.లక్ష చెక్కును విరాళంగా అందించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, రెడ్‌క్రాస్ కోశాధికారి గంధ్రకోట మురళికృష్ణ, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ టీ-20 విజేత గుంటూరు




ఏసీఏ సెంట్రల్ జోన్ అంతర జిల్లాల టీ-20క్రికెట్ విజేత గుంటూరు జట్టు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సెంట్రల్ జోన్ అంతర జిల్లాల సీనియర్ పురుషుల టీ-20 క్రికెట్ పోటీల విజేతగా గుంటూరు జట్టు నిలిచింది. ఈ నెల 21వ తేదీ నుంచి ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులోకి ఏసీఏ మైదానాల్లో జరుగుతున్న ఈ పోటీలకు ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించాయి. ఈ పోటీల్లో గుంటూరు జట్టు వరుసగా మూడు జట్లపై గెలిచి ఆరు పాయింట్లతో విజేతగా నిలిచింది. ఆదివారం సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో గుంటూరు జట్టు ప్రత్యర్థి కృష్ణా జట్టుపై ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు ఏడు వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. మధ్యాహ్నం రెండు గంటలకు రెండో ఇన్నింగ్స్ ప్రారంభమైన కొద్ది సేపటికే(1.3 ఓవర్లకు) ఆకాశం మేఘావృతమై వెలుతురు లేకపోవడంతో నిర్వాహకులు వీజేడీ పద్ధతిలో 11 ఓవర్లకు మ్యాచ్‌ను కుదించారు. ఈ నిర్ణయంతో రెండో ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు తన 93 పరుగుల విజయలక్ష్యాన్ని మూడు వికెట్లు నష్టపోయి 8.5 ఓవర్ వద్ద ఛేదించింది. ప్రకాశం,కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల జట్లు ఈ టోర్నీలో ఒక్కో మ్యాచ్ చొప్పున గెలిచి రెండేసీ పాయింట్లను సాధించాయి. రన్ రేట్ ఆధారంగా ఈ జట్లకు రెండు, మూడు, నాలుగు స్థానాలను కేటాయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

గ్రామ స్వరాజ్యం.. సాకారం

మహాత్ముని ఆశయాలను ఆచరణలోకి తెచ్చిన ప్రభుత్వం

- గ్రామీణ ప్రాంతాల్లో సకల మౌలిక వసతులు
- స్థానిక సంస్థల పరిపాలనకు పెద్దపీట
- పచ్చదనం, పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన నిలయాలుగా పల్లెటూళ్లు
- నేడు జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం
- రాష్ట్రస్థాయిలో పురస్కారాలకు ఎంపికైన నడింపాలెం, కాసిపాడు గ్రామాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో వివిధ అంశాల్లో మరో 23 గ్రామ పంచాయతీలకు పురస్కారాలు



కాశిపాడు గ్రామ ఏరియల్ వ్యూ

గుంటూరుఎడ్యుకేషన్: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కళ్ల ముందు ఆవిష్కృతమైంది. పల్లెటూళ్లు దేశానికి పట్టుకొమ్మలు అనే నినాదాన్ని నిజం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ద్వారా ఆచరణలోకి తెచ్చిన గ్రామస్వరాజ్యం సత్ఫలితాలనిస్తుంది. పచ్చదనం-పరిశుభ్రతతో నిండిన పల్లెటూళ్లు, ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీలు ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాయి.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా..

ప్రభుత్వ పరిపాలనలో స్థానిక సంస్థలకు చోటు కల్పిస్తూ రాష్ట్రపతి ఆమోదంతో అమల్లోకి వచ్చిన 73వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ప్రతి ఏటా ఏప్రిల్ 24వ తేదీని జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంగా జరుపుకొంటున్నాం. 73వ రాజ్యాంగ సవరణ గ్రామ పంచాయతీలు, గ్రామ సభలకు రాజ్యాంగ హోదా కల్పించింది.

సచివాలయాలతో స్థానిక పాలనకు పెద్దపీట..

గ్రామ, వార్డు సచివాలయాల స్థాపన ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు స్థానిక పాలన అందిస్తూ, ప్రభుత్వ సేవలన్నింటినీ ఇంటి ముంగిటకే తెచ్చారు. పరిపాలన, సుస్థిరమైన అభివృద్ధి పథంలో పయనిస్తున్న గ్రామ పంచాయతీలు జిల్లాస్థాయితో పాటు రాష్ట్రస్థాయిలో ప్రగతి పథంలో దూసుకెళ్తున్నాయి.

మేటి గ్రామ పంచాయతీలకు అవార్డులు..

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర అభివృద్ధి, సుపరిపాలన, పచ్చదనం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన పరిసరాలు, తాగునీటి వనరులు పుష్కలంగా ఉన్న గ్రామాలు, వనరులను చక్కగా వినియోగించుకుని ప్రజల జీవన విధానంలో మార్పులు, స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రతతో నిండిన గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి వాటికి ప్రభుత్వం అవార్డులను అందిస్తోంది. పేదరికం లేని మెరుగైన జీవనోపాధి గల పంచాయతీ, పిల్లలతో స్నేహపూర్వక, ఆరోగ్యకరమైన, మహిళా స్నేహపూర్వక పంచాయతీ అంశాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న గ్రామ పంచాయతీలకు అవార్డులను బహూకరించనుంది. ఆయా అంశాల వారీగా జిల్లా, రాష్ట్రస్థాయి పురస్కారాలకు ప్రభుత్వం ఎంపిక చేసింది.

రాష్ట్రస్థాయికి ఎంపికైన గ్రామ పంచాయతీలు..

స్థానిక పరిపాలనలో ప్రగతి పథంలో పయనిస్తున్న గ్రామ పంచాయతీలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసిన ప్రభుత్వం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అవార్డులను అందజేయనుంది. ఇందులో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి రెండు గ్రామ పంచాయతీలు రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపికయ్యాయి. ఆరోగ్యకర పంచాయతీ విభాగంలో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెం, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని కాసిపాడు గ్రామాలు ఎంపికయ్యాయి. జిల్లాస్థాయి పురస్కారాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 23 గ్రామ పంచాయతీలు ఎంపికయ్యాయి. వాటిలో గుంటూరు జిల్లా నుంచి 6, పల్నాడు 8, బాపట్ల జిల్లా నుంచి 9 చొప్పున ఉన్నాయి. పురస్కారాలకు ఎంపికైన ఆయా గ్రామ సర్పంచ్‌లకు ఆయా జిల్లాల కలెక్టర్లు సోమవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు.

- గుంటూరు జిల్లా కొల్లిపర మండలంలోని అత్తోట, బొమ్మువానిపాలెం, కుంచనవరం గ్రామాలు వరుసగా చైల్డ్‌ఫ్రెండ్లీ, వాటర్ సఫీషియెంట్ పంచాయతీ, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీలుగా నిలిచాయి. తాడికొండ మండలంలోని లచ్చన గుడిపూడి, ముక్కామల, రావెల గ్రామ పంచాయతీలు వరుసగా క్లీన్ అండ్ గ్రీన్, పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్, పావర్టీ ఫ్రీ అండ్ ఎన్‌హేన్స్‌డ్ లైవ్లీహుడ్స్ పంచాయతీ విభాగంలో ఎంపికయ్యాయి.
- పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడు, తూబాడు, పెదకూరపాడు మండలం చినమక్కెన, పిడుగురాళ్ల మండలంలోని కోనంకి, పందిటివారిపాలెం, రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం, శావల్యాపురం మండలంలోని శానంపాడు గ్రామాలు ఎంపికయ్యాయి.
- బాపట్ల జిల్లాలో అమృతలూరు మండలంలోని అమృతలూరు, కూచిపూడి, పంచలవరం, బాపట్ల మండలంలోని ఏతేరు, జిల్లెళ్లమూడి, కర్లపాలెం మండలంలోని దమ్మనవారిపాలెం, చుండూరు మండలంలోని యడ్లపాడు, పెదగాదెలవర్రు గ్రామాలు ఆయా విభాగాల్లో పురస్కారాలకు ఎంపికయ్యాయి.

వ్యర్థాలతో సంపద సృష్టి..



డంపింగ్‌యార్డులో పోగవుతున్న చెత్త వ్యర్థాల నుంచి ఎరువులను తయారు చేయడం ద్వారా సంపదను సృష్టించే ప్రయత్నం చేశాం. గ్రామ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని పచ్చదనం, పరిశుభ్రతతో పాటు ఆరోగ్యకరమైన గ్రామంగా తీర్చిదిద్దాం. ప్రభుత్వం మా గ్రామాన్ని చైల్డ్‌ఫ్రెండ్లీ పురస్కారానికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది.

– గొర్రె సాంబయ్య, సర్పంచ్, కాసిపాడు, పెదకూరపాడు మండలం

సమష్టి కృషితో దక్కిన పురస్కారం..



మా గ్రామానికి రాష్ట్రస్థాయిలో ఆరోగ్యకరమైన పంచాయతీగా అవార్డు లభించడం ఆనందంగా ఉంది. పంచాయతీ కార్యదర్శి మొదలు ఆరోగ్య కార్యకర్తలు, గ్రీన్ అంబాసిడర్లు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు.. ఇలా అందరి సమష్టి కృషితోనే సాధ్యమైంది. ఈ అవార్డు మాపై మరింత బాధ్యతను పెంచింది.

– లాం రత్నకుమార్, సర్పంచ్, నడింపాలెం, ప్రత్తిపాడు మండలం

రేపటిలోగా విద్యా ప్రవేశాలను ధ్రువీకరించుకోవాలి

డీఈఓ పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు పాఠశాలల్లో పేద వర్గాల పిల్లలకు విద్యాహక్కుచట్టం ద్వారా వచ్చే విద్యాసంవత్సరానికి కల్పించిన ఉచిత నిర్బంధ విద్యా ప్రవేశాలను ఈనెల 25లోపు ధ్రువీకరించుకోవాలని గుంటూరు డీఈఓ పి.శైలజ ఆదివారం ఒ ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కుచట్ట ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్ల కేటాయింపు ద్వారా జిల్లాలో 445 మంది విద్యార్థులు ఒకటో తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించారని తెలిపారు. సంబంధిత విద్యార్థుల జాబితాను అన్ని ఎంఈఓ కార్యాలయాలకు పంపిన దృష్ట్యా, సదరు జాబితాలను ఆయా కార్యాలయాల్లో ప్రదర్శించాలని ఆమె ఎంఈఓలను ఆదేశించారు. సీఆర్పీలు, గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది సహకారంతో ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు నిరాకరిస్తే సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రక్రియ మొత్తం ఈనెల 25వ తేదీలోపు పూర్తి కావాలని స్పష్టం చేశారు.

ప్రతిఒక్కరి జీవితంలో క్రీడలు భాగం కావాలి

- తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- జిల్లాస్థాయి మెన్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రికెట్ బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రతిఒక్కరి జీవితంలో క్రీడలు భాగం కావాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఒకప్పుడు మైదానంలో ఆటలాడుతుండే పిల్లల్ని చూసి తల్లిదండ్రులు చదువుపోతుందని భయపడే పరిస్థితులు ఉండేవని, ఆటలతో ఆరోగ్యం సమకూరుతుందని తెలిసి ఇప్పుడిప్పుడే ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. దానికి తగినట్టే నేటి తరం యువత క్రేజీ క్రీడ క్రికెట్‌ను ఎంతగానో ఆరాధిస్తున్నట్టు చెప్పారు. 23వ వార్డు కౌన్సిలర్ శానంపూడి రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో, రుద్రపాటి శ్రీకాంత్, పల్లేటి శ్రీకాంత్ నిర్వహణలో అన్నాబత్తుని సత్యనారాయణ స్మారక జిల్లాస్థాయి మెన్స్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ఆదివారం స్థానిక మార్కెట్ యార్డులో ప్రారంభమయ్యాయి. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ అవుతు సీత పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే శివకుమార్ కొద్దిసేపు బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. తన తండ్రి, మాజీ మంత్రి అన్నాబత్తుని సత్యనారాయణ పేరిట జిల్లాస్థాయి క్రికెట్ పోటీల నిర్వహణ ఎంతో సంతోషంగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీపడాలని అన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, ఎంపీటీసీ ధర్మరాజుల చెన్నకేశవులు, కౌన్సిలరు శానంపూడి రఘురామిరెడ్డి మాట్లాడారు. రుద్రపాటి శ్రీకాంత్, పల్లేటి శ్రీకాంత్, సీహెచ్ వెంకటేష్, ఎస్.సుధీర్, జె.వసంత, వై.కమల్, వెంకీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

28న హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రామ్‌కు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రామ్‌కు ఇంటర్మీడియెట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఎంపిక ప్రక్రియను ఈనెల 28న చేపడుతున్నట్లు ఇంటర్‌బోర్డు ఆర్‌ఐఓ జి.సునీత ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు ప్రోగ్రామ్‌లో ఎంపికైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ ఇంటర్న్‌షిప్‌తో పాటు 12 నెలల నైపుణ్యం పెంపొందించుకునే ప్రోగ్రామ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.10వేల స్టైఫండ్‌తో పాటు శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులకు హెచ్‌సీఎల్‌లో ఉద్యోగం, ప్రముఖ ఐఐటీలో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు గణితం, బిజినెస్ మాథమాటిక్స్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https://bit.ly/HCLTB_AndhraPraderh లింక్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు Ummadisetti.anil@hcl .com మెయిల్‌తో పాటు 8555085030 నంబర్లో హెచ్‌సీఎల్ ప్రతినిధిని సంప్రదించాలని తెలిపారు.

పంచాయతీరాజ్ డీఈ సాంబానాయక్ మృతి



కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా పంచాయతీరాజ్ విభాగంలో కొవ్వూరు డివిజనల్ ఇంజినీర్ బి.సాంబానాయక్ (55) ఆదివారం మృతి చెందారు. ఆయనకు ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకినట్టు ఇటీవలే గుర్తించారు. అప్పటికే వ్యాధి తీవ్రత పెరగడంతో ఆదివారం గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని తన స్వగృహంలో సాంబానాయక్ మృతి చెందినట్లు ఇక్కడి ఆ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఆయన మృతదేహానికి సోమవారం దుగ్గిరాలలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. అనారోగ్యంగా కారణంగా మార్చి 28 నుంచి ఆయన సెలవుపై వెళ్లారు. సుమారు నాలుగేళ్లుగా కొవ్వూరులో పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.


'గురి'కుదిరింది.. బాణం ఎక్కుపెట్టిన ఆర్చర్ జ్యోతి సురేఖ

బంగారు జ్యోతి

మన సురేఖ.. డబుల్ ధమాకా

- ఆర్చరీ ప్రపంచ కప్‌లో విజయవాడ ఆర్చర్ అద్భుత ప్రదర్శన
- కాంపౌండ్ వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు
- ఇప్పటి వరకూ మొత్తం 44 అంతర్జాతీయ పతకాలు కైవసం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రపంచ వేదికపై విజయవాడ ఆర్చర్, అర్జున అవార్డు గ్రహీత వెన్నం జ్యోతిసురేఖ మరోసారి మెరిసింది. ప్రపంచ ఆర్చరీ కప్ కాంపౌండ్ విభాగంలో దేశానికి ప్రాతినిధ్యం వహించి సత్తా చాటింది. ఈ నెల 22వ తేదీన తుర్కియేలోని అంటాల్యాలో జరిగిన ఈ పోటీల వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి రెండు బంగారు పతకాలు కైవసం చేసుకుంది. ముందుగా మిక్స్‌డ్ విభాగంలో హోరాహోరీగా జరిగిన ఫైనల్స్‌లో మహారాష్ట్ర ఆర్చర్ ప్రవీణ్‌దేవ్‌తో కలిసి చైనా జోడిని 159–154 పాయింట్లతో ఓడించి బంగారు పతకం అందుకుంది. ఆ తర్వాత మహిళల వ్యక్తిగత విభాగంలో కొలంబియా క్రీడాకారిణి సారాలోపెజ్‌పై గెలిచి బంగారు పతకాన్ని ముద్దాడింది. ప్రస్తుతం ప్రపంచ 11వ ర్యాంకర్‌గా కొనసాగుతున్న జ్యోతి సురేఖ, ప్రపంచ మూడో ర్యాంకర్ సారాలోపెజ్‌పై గెలిచి తన క్రీడా ప్రస్థానంలో మరో మైలురాయిని అందుకుంది.

అందరికీ స్ఫూర్తిదాయకం



ప్రపంచ వేదికపై సురేఖ బంగారు పతకం గెలవడం గర్వకారణం. ఆమెను ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని క్రీడాకారులు రాణించాలి. సురేఖ సాధించిన ఘనతలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి డెప్యూటీ కలెక్టర్‌గా నియమించింది. ప్రస్తుతం ఆమె శిక్షణలో ఉన్నారు.
– ఎస్. ఢిల్లీరావు, కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

45 టోర్నీల్లో.. 44 పతకాలు

బాల్యం నుంచే కాంపౌండ్ ఆర్చర్‌గా అవతారం ఎత్తిన జ్యోతిసురేఖ తన కెరీర్‌లో ఎన్నో అద్భుత విజయాలను అందుకుంది. సబ్, జూనియర్ విభాగాల్లో వందలాది జాతీయ పతకాలను సాధించింది. జ్యోతి ఏకాగ్రత, నిలకడైన ఆటతీరును గుర్తించిన భారత ఆర్చరీ సమాఖ్య ప్రతినిధులు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. 2011లో తన 14వ ఏట ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో మొదటిసారి పోటీపడిన సురేఖ ఇప్పటి వరకు జరిగిన 45 అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మొత్తం 44 పతకాలను సాధించింది. 2011 ఏషియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్ టీమ్ విభాగంలో బ్రాంజ్‌తో ప్రారంభమైన సురేఖ విజయ ప్రస్థానం.. ప్రస్తుత ప్రపంచ కప్ పోటీల్లో రెండు బంగారు పతకాల వరకూ నిర్విఘ్నంగా సాగింది.

ప్రభుత్వ ప్రోత్సాహం..

ప్రపంచ స్థాయిలో ఆంధ్ర రాష్ట్ర ఖ్యాతిని చాటుతున్న జ్యోతిసురేఖ సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. 12 ఏళ్లుగా తాను కష్టపడుతూ రాష్ట్రానికి తీసుకొస్తున్న పేరు ప్రఖ్యాతలను గతంలో ఏ ప్రభుత్వమూ గుర్తించలేదు. 2019లో ముఖ్యమంత్రి పదవిని అలంకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమె కష్టాన్ని గుర్తించారు. 2022 డిసెంబర్ 19వ తేదీన సీఎం జగన్ ఆమెను ప్రత్యేకంగా సన్మానించి, అదే రోజు గ్రూప్–1(డెప్యూటీ కలెక్టర్) ఉద్యోగం ఇచ్చి గౌరవించారు. అదే విధంగా కేంద్ర ప్రభుత్వం 2017లో 'అర్జున అవార్డు', 2018లో 'ఇండియన్ అన్‌బాండ్ ఎక్స్‌లెన్సీ' అవార్డు, 'ఎక్సెప్షనల్ అచీవ్‌మెంట్ అవార్డు', 2016లో సాక్షి మీడియా 'యంగ్ ఎచీవర్ అవార్డు', రాష్ట్ర ప్రభుత్వం 'ప్రతిభా పురస్కారం', 2018లో జీ టీవీ 'అప్సర అవార్డు', 2014లో అమెరికాలోని అక్కినేని ఫౌండేషన్ 'క్రీడారత్న' అవార్డు అందించాయి.


బంగారు పతకాలతో జ్యోతి సురేఖ

చిన్ననాటి నుంచీ విజయాలే



జ్యోతికి క్రీడలపై ఉన్న ఆసక్తిని ఆమె మూడో ఏటనే గమనించాం. అప్పట్లో స్విమ్మింగ్‌లో శిక్షణ ఇప్పించాం. నాల్గో ఏట కృష్ణానదిని ఈది అప్పట్లోనే ప్రపంచ రికార్డు సృష్టించింది. ఆ తర్వాత ఆర్చరీలో శిక్షణ ఇప్పించాం. చిన్నతనంలోనే ఎన్నో పతకాలు సాధించింది. ప్రపంచ నంబర్ వన్ ర్యాంకర్‌గా ఎదగాలని నిత్యం తపిస్తూ ఉంటుంది.
– శ్రీదుర్గ, జ్యోతిసురేఖ తల్లి

నిత్యం ఆర్చరీపైనే ధ్యాసే



అంతర్జాతీయ పోటీలకు వెళ్తున్నప్పటి నుంచి జ్యోతి మాతో గడిపిన రోజులు చాలా తక్కువ. మా అమ్మాయి కష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినందుకు సంతోషంగా ఉంది. అకాడమీ ఏర్పాటు చేసి రాష్ట్రంలో మరింత మంది ప్రపంచ స్థాయి ఆర్చరీ క్రీడాకారులను తయారు చేయాలన్నదే జ్యోతి ఆకాంక్ష.
– సురేంద్ర, జ్యోతిసురేఖ తండ్రి

అందరికీ ప్రాధాన్యం..



వెళ్లిన ప్రతి అంతర్జాతీయ పోటీలోనూ కచ్చితంగా పతకం సాధిస్తుంది. చాలా కష్టపడుతుంది. కుటుంబానికి, బంధువులకు, స్నేహితులకు చాలా ప్రాముఖ్యం ఇస్తుంది. ఎక్కడున్నా రోజూ ఫోన్ చేసి మాట్లాడుతుంది.
– డాక్టర్ ధర్మేంద్రకుమార్, జ్యోతిసురేఖ బాబాయ్

ఆశాజనకంగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం

- ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.643 కోట్లు ఆర్జన
- ఊపందుకున్న రాజధాని ప్రాంత రిజిస్ట్రేషన్లు
- ధరలు పెంచకపోవడంతో ముందుకు వస్తున్న ప్రజలు

గుంటూరు వెస్ట్: ముగిసిన ఆర్థిక సంవత్సరానికి స్టాంపులు రిజిస్ట్రేషన్ల ద్వారా జిల్లాలో ఆదాయం ఆశాజనకంగా ఉంది. నాలుగేళ్ల నుంచి రిజిస్ట్రేషన్ల చార్జీలు నామ మాత్రంగానే పెంచడం ద్వారా ప్రజలకు ఊరట కలిగించింది. 2022–23 సంవత్సరానికి జిల్లా ఆదాయ లక్ష్యంగా రూ.708 కోట్లు లక్ష్యం కాగా 1,33,193 వివిధ రకాలైన దస్తావేజులు రిజిస్ట్రేషన్లు చేయడం ద్వారా రూ.643 కోట్లు ఆదాయాన్ని సమకూర్చుకుంది. అంతకు ముందు అంటే 2021–22 ఆర్థిక సంవత్సరానికి రూ.571 కోట్లు లక్ష్యం కాగా రూ.547 కోట్లు ఆర్జించింది. అవినీతిని తగ్గించే ప్రక్రియ చేపట్టడంతో పాటు సేవల్లో పారదర్శకతకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీటవేసింది. దీంతో సత్ఫలితాలు వస్తున్నాయి. ముఖ్యంగా 22ఏ (ఇ) జాబితా నుంచి గడచిన ఏడాది 8 వేల ఎకరాలను తొలగించింది. దీంతో చాలా ఎకరాల పొలాలు రిజిస్ట్రేషన్లు చేపట్టారు.


గుంటూరు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వేచి ఉన్న కక్షిదారులు

రాజధాని ప్రాంతంలో పెరిగిన రిజిస్ట్రేషన్లు

తుళ్లూరు పరిసర ప్రాంతాల్లో క్రయవిక్రయాలు జోరందుకోవడంతో రిజిస్ట్రేషన్లు కూడా బాగా పెరిగాయి. 2019లో స్వల్పంగా తగ్గినా గడచిన మూడేళ్లలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఊపందుకుంది. అమరావతి ప్రాంతంలోని అనంతవరం, మందడం, తుళ్లూరు సబ్ రిజిస్ట్రేషన్ల కార్యాలయాల ఆదాయం రూ.20 కోట్లు కాగా రూ.22.5 కోట్లు సాధించింది. ఈ మూడు రిజిస్ట్రేషన్ల కార్యాలయాల ఆదాయానికి సంబంధించిన వివరాలు..

ఎస్ఆర్ఓ -	లక్ష్యం	ఆర్జించిన ఆదాయం	దస్తావేజుల సంఖ్య
అనంతవరం	రూ. 72 లక్షలు	4.23 కోట్లు	2346
మందడం	రూ. 12.27 కోట్లు	11.17 కోట్ల	2412
తుళ్ళూరు	రూ. 6.88 కోట్లు	7.10 కోట్లు	3280
మొత్తం	రూ. 19.87 కోట్లు	22.50 కోట్లు	8038

వేగంగా సేవలందుతున్నాయి



ఇటీవల గుంటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒక రిజిస్ట్రేషన్ చేయించాం. మరుసటి రోజునే రిజిస్ట్రేషన్ అయిన దస్తావేజులు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ సమయంలో కూడా పెద్దగా వేచి చూడలేదు. ముందుగానే ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకుని వెళ్లి అరగంటలో బయటకు వచ్చేశాం.
–అయితి సతీష్, జాయ్‌అండ్ షైన్ వెల్‌నెస్ కోచ్, గుంటూరు

చక్కని ప్రగతి సాధించాం



నూతన గుంటూరు జిల్లాలో ఆదాయం మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ముఖ్యంగా అమరావతి రాజధాని ప్రాంతంలోని మూడు ఎస్ఆర్ఓల్లో ఆదాయం బాగా వృద్ధి చెందింది. కేవలం ఈ మూడు ఆఫీసుల్లోనే రూ.22.5 కోట్లు సాధించాం. ఈ ఏడాది మరింత ఆశాజనకంగా ఉంటుంది. ఈ–స్టాంపింగ్ విధానంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత సులభంగా మారుతుంది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలోగాని, సేవలు పొందే క్రమంలోగాని ఇబ్బందులు ఎదురైతే సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌నిగాని జిల్లా రిజిస్ట్రార్‌ను గాని సంప్రదించవచ్చు. సేవల్లో పారదర్శకతకు తొలి ప్రాధాన్యం.
–జి.శ్రీనివాసరావు, డీఐజీ, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ

వైఎస్సార్ సీపీ దళిత నాయకుడిపై దాడికి యత్నం

టీడీపీ నేతపై పోలీసులకు ఫిర్యాదు



తాడికొండ: వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నాయకుడు శృంగారపాటి సందీప్‌పై తెలుగుదేశం పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షుడు గద్దం వెంకటేశ్వరరావు దాడికి యత్నించాడు. తుళ్లూరులోని శృంగారపాటి సందీప్ ఇంటికి వెంకటేశ్వరరావు మద్యం మత్తులో వెళ్లి గతంలో చంద్రబాబు నాయుడును తిట్టావని, బాబు పర్యటన సందర్భంగా రాజధానిలో చెప్పులు, రాళ్లు వేయించావంటూ వాదనకు దిగాడు. సందీప్ తల్లిదండ్రులతో వాదనకు దిగి నీ అంతుచూస్తా అంటూ బెదిరించాడు. ఈ ఘటనపై సందీప్ పలువురు వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం కేసు నమోదు చేయనున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు.

టీడీపీ నాయకులకు దాడులు పరిపాటిగా మారాయి

సందీప్ మీడియాతో మాట్లాడుతూ దళితులపై దాడులు చేయడం టీడీపీ నాయకులకు పరిపాటిగా మారిందని అన్నారు. బాబుతోపాటు ఆ పార్టీ నాయకులు దళితులు తమకు అనుకూలంగా లేరనే అక్కసుతో దాడులు చేయిస్తున్నాడని, అందులో భాగంగానే తనపై భౌతికదాడులు చేసేందుకు యత్నించి కులం పేరుతో దూషించాడన్నారు. గతంలో కూడా తనపై దాడులకు యత్నించారని అప్పుడు పెట్టిన కేసు ఇంకా కోర్టులో ఉండగానే మరో దాడి జరిగిందని, తన కారును కూడా పగలగొట్టిన ఘటన కూడా జరిగిందన్నారు. ఎవరెన్ని దాడులు నిర్వహించినా భయపడేది లేదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారి కోసం ప్రాణత్యాగానికి అయినా సిద్ధమే అన్నారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్టు

చీరాలరూరల్: రైళ్లల్లో సెల్‌ఫోన్లు అపహరిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. రూ.2 లక్షల విలువైన 16 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం రాత్రి స్థానిక జీఆర్పీ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్పీఎఫ్ సీఐ వీ శ్రీనివాసరావు నిందితుడి వివరాలు వెల్లడించారు. చీరాల విఠల్‌నగర్‌లోని శ్మశానవాటిక సమీపంలో నివాసముండే (తమిళ) ఆర్ముగం విజయ్ అనే వ్యక్తి చీరాల–ఒంగోలు రైల్వేస్టేషన్ల మధ్యలో గల రైళ్లల్లో ప్రయాణికుడి మాదిరిగా సంచరిస్తుంటాడు. ఈ క్రమంలో రద్దీగా ఉండే సమయాల్లో ప్రయాణికులు ఆదమరచి నిద్రించే సమయాలను గుర్తించి వారివద్ద నున్న సెల్‌ఫోన్లను తస్కరిస్తుంటాడు. సెల్‌ఫోన్లు విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ తిరుగుతుంటాడు. అతనిపై నిఘాఉంచి సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితుడిని రైల్వే స్టేషన్ దక్షిణం వైపున జీఆర్పీ ఎస్సైసీహెచ్. కొండయ్య అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. నిందితుడిని రిమాండుకు తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


సభలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- బాపట్ల మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారం

బాపట్ల: రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందనే విధానంతో వ్యవసాయ రంగంలో రైతు నష్టపోకుండా వినియోగదారులపై భారం పడకుండా ధరల స్థిరీకరణకు వ్యవసాయ మార్కెట్ కమిటీలు ప్రధాన భూమిక నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా రైతు భరోసా కేంద్రాలు నిర్వహణ గిడ్డంగుల నిర్మాణం వంటివి చేపట్టి రైతులు పండించిన ఆహార ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేందుకు శీతల గిడ్డంగుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విలువ ఆధారిత ఉత్పత్తులపై దృష్టి సారించే దిశగా ప్రభుత్వం యోచిస్తుందన్నారు. వాటికి అవసరమైన విధివిధానాలు రూపకల్పన చేసి మార్కెట్ కమిటీల ద్వారా నిర్వహించే విధంగా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో ప్రాంతాలవారీగా కాలానుగుణంగా ఉత్పత్తి అయ్యే పండ్లు ఇతర ఆహార ఉత్పత్తుల ద్వారా అవసరమైన పోషక విలువలు తగ్గని ఆహార పదార్థాలను తయారుచేసే ప్రక్రియకు శ్రీకారం చుడతామన్నారు. ప్రధానంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు రైతులను సమాయత్తం చేస్తున్నామన్నారు. గుడ్ అగ్రికల్చర్ సర్టిఫికెట్ దేశంలో ఆంధ్ర రాష్ట్రానికే లభించిందన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ రైతులకు అండదండలు అందించాలని లక్ష్యంతో 1972లోనే ఇక్కడ వ్యవసాయ మార్కెట్ కమిటీని తమ తండ్రి కోన ప్రభాకరరావు హయాంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తొలుత బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైస్ చైర్మన్ పిన్నిబోయిన ప్రసాద్, కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో శాసనమండలి విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మ, ఆర్డీఓ జి రవీంద్ర, మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు, కర్లపాలెం, బాపట్ల జెడ్పీటీసీ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, ఎస్తేరురాణి, బాపట్ల, పీవీపాలెం ఎంపీపీలు హరిబాబు, బాజీ, బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, చింతలపాలెం పీఏసీఎస్ అధ్యక్షులు పెద్దబ్బాయి పాల్గొన్నారు.